

అందరి రక్షణ వాళ్ల ధ్యేయం.
ఆందోళనలు శ్రుతిమించకుండా కాపుకాసేది వాళ్లే!
బందోబస్తులో ముందుండేదీ వాళ్లే!
ప్రజలకు, ప్రభుత్వ ఆస్తులకు రక్షణనిస్తున్న బెటాలియన్ పోలీసులు.. తమ ఇంటికి, ఇల్లాలికి అండగా ఉండలేకపోతున్నారు. కన్నవారి అవసరాలు తీర్చలేకున్నారు. పిల్లలతో ఆనందాల్ని పంచుకోలేకపోతున్నారు. అందుకే, బెటాలియన్ పోలీసు కానిస్టేబుళ్ల ఇల్లాళ్లు కదం తొక్కారు. 'ఏక్ పోలీస్..' మా విధానమంటూ డప్పుకొట్టి.. గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కార్.. తమ గోడు వినాలంటూ నినదించారు. వారిది ఆవేశం కాదు.. ఆవేదన. రిక్వెస్ట్ కాదు.. డిమాండ్. ఆ తడారిన గొంతుకల్లో వినిపించని విషాద గాథలు ఎన్నో..

# ఆయనకు విడుదలెప్పుడు?!

**మొన్న** ఆడపడుచుల ఆర్తనాదాలతో సచివాలయం పరిసరాలు.. నిన్న ప్రధాన రహదారులు దద్దరిల్లాయి. 'వియ్ వాంట్.. జస్టిస్!'.. 'పోలీసు కుటుంబం నుంచి వచ్చిన రేవంతన్నా.. టీజీఎస్పీ ఖాకీని నౌకర్‌గా మార్చొద్దన్నా', 'కావాలి కావాలి.. ఏక్ పోలీస్ కావాలి' అనే నినాదాలతో మహిళలు గర్జిస్తున్నారు.

**అందరు** పోలీసుల్లాగే వాళ్లూ ఒకే పరీక్ష రాశారు. ఫిజికల్ టెస్టులు పాసయ్యారు. తొమ్మిది నెలలు కఠిన శిక్షణ తీసుకున్నారు. బెటాలియన్ పోలీసులుగా విధుల్లో చేరాక.. విధిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రజారక్షణలో ఆల్వేస్ ముందుండే వీళ్లతో ప్రభుత్వం గొడ్డుచాకిరీ చేయిస్తున్నది. రోజుల తరబడి విధుల పేరుతో నరకం చూపిస్తున్నది. 26 రోజుల డ్యూటీ అంటూ కుటుంబానికి కాకుండా చేస్తున్నది. ఒకేచోట ఉద్యోగం చేసే వెసులుబాటు లేకపోవడంతో బెటాలియన్ పోలీసుల బతుకు.. సంచార జీవితమైంది. నెల తిరిగాక ఇంటికొచ్చిన తండ్రి.. రెండ్రోజులకు మళ్లీ డ్యూటీకి వెళ్తుంటే.. ఇంటిల్లిపాదీ 'మళ్లీ ఎప్పుడొస్తావ్?' అని దీనంగా చూపులతోనే ప్రశ్నిస్తున్నారు. వాళ్ల మౌనప్రశ్నకు సమాధానం ఇవ్వలేక, మనసులో పెల్లుబికిన ఆవేదనను పంటికింద అదుముకొని వెనక్కి తిరక్కుండా బయటికి దారితీస్తున్నాడు ఆ పోలీసన్న. ఆ ఆవేదన ఇప్పుడు కట్టలు తెంచుకుంది. 'ఇదేం విధానం' అని ప్రశ్నించిన బెటాలియన్ పోలీసులపై కక్ష కట్టింది ప్రభుత్వం. అందుకే, పోలీసుల ఇల్లాళ్లు, తల్లులు, పిల్లలు రోడ్డెక్కారు.

'సార్.. మా బాబుకు 15 నెలలు. వాడికి కుక్క తెలుసు, ఇంట్లో పిల్లి తెలుసు. కానీ, నెలరోజులకు ఒకసారి వచ్చే తండ్రిని పోల్చుకోలేడు! నా గుండెకోత ఎవరికి చెప్పుకోవాలి. ఈ దుస్థితి ఎందుకొచ్చింది? తీసుకొచ్చిన వారెవరు?' ఓ తల్లి కన్నీటి వేదన. 'బెటాలియన్ పోలీసులను ఇంటికి పంపకుండా చాలా ఇబ్బందులు పెడుతున్నారు. వాళ్లకు ఎలాంటి డ్యూటీ టైమింగ్ లేదు. నాన్‌స్టాప్‌గా పనులు చెబుతున్నారు. వారితో వెట్టి చేయిస్తున్నారు. భార్యాపిల్లలకు, తల్లిదండ్రులకు దూరంగా ఉంటే ఆ బాధ ఎలా ఉంటుందో మీకు తెలియదా సార్?' అంటూ ఓ బెటాలియన్ పోలీసు ఇల్లాలు సూటిగా సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం ఎవరు చెబుతారు?

### మమ్మల్ని ఆదుకునేది ఎవరు?

'నేను రెండు నెలల గర్భిణిని. నాకు 18 నెలల వయసున్న కొడుకున్నాడు. మా ఆయన నన్ను కనీసం ఆస్పత్రికి కూడా తీసుకెళ్లలేకపోతున్నానని కన్నీళ్లు పెట్టుకుంటున్నాడు. నేను ఇంట్లో పనులు చేసుకోవాలి. వీడ్ని చూసుకోవాలి. దవాఖానకు వెళ్లాలి. ఇంట్లో వృద్ధులైన అత్తమామలు ఉన్నారు. మా తల్లిదండ్రులు ఎంతకాలమని మాతో ఉంటారు? నన్ను ఆస్పత్రికి ఎవరు తీసుకెళ్లాలి? చెప్పండి సార్. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం.. ఇంట్లో సరుకులు తెచ్చేవాళ్లు ఉండరు. ఏదైనా ఎమర్జెన్సీ అయితే పట్టించుకునే దిక్కు ఉండదు. మా బాధలు పట్టించుకునేటోళ్లు లేరు. ఈ బతుకులు బతకడం కన్నా చావడం బెటర్' అంటూ మరో ఆడబిడ్డ ఆవేదన. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో కష్టం. ఎవరి దీనగాథ వారిది.



### పిల్లనిస్తలేరు...

'పిలగాడు ఏం కొలువు చేస్తుండమ్మా..'
'పోలీసు నౌకరీ'.
'అయితే మంచిదే'
'ఎక్కడ ఏం డ్యూటీ చేస్తడమ్మా..'
'టీజీఎస్పీ కానిస్టేబులు'..
'అవునా.. అయితే మీ సంబంధం వద్దులేమ్మా.. నెలలో రెండ్రోజులు మాత్రమే ఇంట్లో ఉండే పిలగాడికి ఇక మా పిల్లనేం ఇస్తాంలే..' అని ఆడపిల్ల తల్లిదండ్రులు ముఖం మీద చెబుతున్నారని ఓ కానిస్టేబుల్ తల్లి ఆక్రోశం వెళ్లగక్కింది. 'డ్యూటీల పేరుతో రోజుల తరబడి స్టేషన్లు, అడవులు పట్టుకొని తిరిగితే.. సంసారం ఎప్పుడు చెయ్యాలె? కుటుంబాన్ని ఎప్పుడు చూసుకోవాలె?' అని టీజీఎస్పీ కానిస్టేబుళ్ల భార్యలు కన్నీటి పర్యంతం అవుతున్నారు. 'ఇట్లాంటి బాధలు ఉంటయనే మా బిడ్డలకు కనీసం పిల్లను ఎవరు ఇస్తలేరు' అని ఓ తల్లి ఆవేదన.

> ఒక్కో బెటాలియన్ పరిధిలోని ఒక్కొక్కరికి మూడు నెలల పాటు డ్యూటీలు వేసి, మరో మూడు నెలలు వేరే ప్రాంతానికి తిప్పుతున్నారు.. ఇలా ఏడాదిలో మూడు జిల్లాలు తిరగాల్సి వస్తున్నది. మేము ఎక్కడ ఉండాలి? మా బిడ్డలు ఎక్కడ చదువుకోవాలి? ఈ తిరుగుడేంది? పోలీసు ఉద్యోగం చేస్తున్న మా వాళ్లను తోటి పోలీసులే జీతగాళ్లలా చూస్తున్నారు. పొద్దున్నే పలుగు, పారలతో గడ్డి పీకిస్తున్నారు.
>
> • ఓ పోలీసు భార్య

### కలిసి ఉండే హక్కు లేదా?

'మా కష్టాలను పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం వినాలని ధర్నాలు చేస్తుంటే.. మా వారిని సస్పెండ్ చేశారు. ఇది ఎంతవరకు న్యాయం? మా ఆయనతో కలిసి ఉండే హక్కు నాకు లేదా? మాకు ఆ స్వాతంత్ర్యం లేదా? ఇదేం ప్రభుత్వం రేవంత్‌రెడ్డిసార్? మూడు నెలలు ఒకచోట.. మరో మూడు నెలలు మరోచోట డ్యూటీలు చేస్తే.. మా పిల్లలను ఎక్కడ చదివించుకోవాలి సార్?' మరో ఆడపడుచు ఆందోళన ఇది.

**ఈ** బాధలన్నీ భరించలేకనే రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నామని చెబుతున్నారు కానిస్టేబుళ్ల భార్యలు. 'మాకు ఒక పండుగ లేదు. ఫంక్షన్ లేదు.. పుట్టినరోజు లేదు.. సచ్చిన రోజు లేదు. ఏ శుభకార్యమైనా డ్యూటీలో ఉన్నా కుదరదని చెబుతున్నారు. కుటుంబాలతో కలుసుడు లేదు.. ఇంటికి ఎప్పుడొచ్చేది సమాచారమే లేదు' అని బోరున విలపిస్తున్నారు మరికొందరు. కొంతమంది తల్లులైతే.. 'ఆఫీసర్ల దగ్గర మా పిల్లలు గొడ్డు చాకిరి చెయ్యాల్నా? నా పిలగాడిని ప్రభుత్వ ఉద్యోగానికి రాయించింది మీ దగ్గర బానిస బతుకు బతికేందుకు కాదు' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నమ్మి ఓట్లేసినందుకు ఇదేనా..

'రేవంత్‌రెడ్డి సార్.. మీరు ఎన్నికలప్పుడు 'ఏక్ పోలీస్' చేస్తామంటేనే నమ్మి మేమంతా మీకు ఓట్లు వేశాం. ఇప్పుడు ఆ ఏక్ పోలీసు వ్యవస్థ తీసుకురాకపోగా.. నాన్‌స్టాప్ డ్యూటీలు 26 రోజులకు పెంచారు. ఇదెక్కడి అన్యాయం ముఖ్యమంత్రి గారు? మిమ్మల్ని నమ్ముకున్నందుకు మా పోలీసు జీవితాలను ఇలా రోడ్ల మీదకు ఎందుకు తీసుకొచ్చారు. ఎంతో సఫర్ అవుతున్నాం. ఇన్నిరోజులు సైలెంట్‌గా ఉన్న మేము.. ఇప్పుడు ఆందోళనకు దిగామంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోండి' అని ప్రభుత్వాన్నీ, నాడు నమ్మించిన కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారు.
'ఏక్ పోలీస్‌పై నిర్ణయం తీసుకోవాలి. ఎన్ని కుటుంబాలను సస్పెండ్ చేస్తారు సార్.. మీరు? సస్పెండ్‌లు జరిగితే మాకు ఆత్మహత్యలే శరణ్యం. అప్పుడు రాష్ట్రం ఎలా అల్లకల్లోలమైతదో మీరే చూస్తారు' అంటూ కొంగుతో కళ్లు ఒత్తుకుంటున్న ఇల్లాలి మాటలు సర్కారు చెవిన పడాలని కోరుకుందాం.

... రవికుమార్ తోటపల్లి
వీరగోని రజనీకాంత్ గౌడ్

# టమాటా క్యూటీ.. పుదీనా బ్యూటీ





**టమాటాలో** మన శరీరానికి మేలు చేసే గుణాలు చాలా ఉంటాయి. టమాటా రసాన్ని ముఖానికి అప్లయ్ చేస్తే.. జిడ్డు మాయమవుతుంది. దీనిని స్క్రబర్‌లా కూడా వాడొచ్చు. టమాటాని మిక్సీలో గానీ, బ్లెండర్‌లోగానీ వేసి గ్రైండ్ చేసి చర్మానికి బాగా పట్టించి.. 15 నిమిషాల తర్వాత చల్లటి నీళ్లతో కడిగేస్తే చర్మం నిగారిస్తుంది.
**పుదీనాలో** చాలా ఔషధగుణాలు ఉంటాయి. ఇది చర్మానికి కొత్త నిగారింపునిస్తుంది. కొన్ని పుదీనా ఆకుల్ని తీసుకుని దానిని పేస్టులా చేసి అందులో ముల్తానీ మట్టి, తేనె, పెరుగు వేసి బాగా కలపాలి. దీనిని ముఖానికి అప్లయ్ చేసి ఆరిన తర్వాత కడిగేయాలి. తరచుగా ఇలా చేయడం వల్ల ముఖం కాంతిమంతంగా తయారవుతుంది.

# రకుల్.. ఆరోగ్య మంత్ర!



**'ఫిట్‌నెస్'** అంటే.. రకుల్‌ప్రీత్ సింగ్‌కు మహా ప్రీతి. నిత్యం ఏవేవో కసరత్తులు చేస్తూ.. 'ఫిట్‌నెస్ ఫ్రీక్'గా పేరు తెచ్చుకున్నది. తాజాగా, జిమ్‌లో వర్కవుట్లు చేస్తూ గాయపడింది రకుల్. ఈక్రమంలోనే బెడ్ రెస్ట్ తీసుకుంటూ.. తన ఆరోగ్య పరిస్థితిపై సోషల్‌మీడియా వేదికగా అప్‌డేట్ ఇచ్చింది. 'ఆరోగ్యమే మహాభాగ్యం. స్వేచ్ఛగా తిరుగుతున్నందుకు ఎంత కృతజ్ఞతతో ఉండాలో మనం తరచూ మర్చిపోతుంటాం!' అంటూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టింది రకుల్‌ప్రీత్ సింగ్. దానికి #LifeLearning హ్యాష్‌ట్యాగ్‌నూ జోడించింది. వివరాల్లోకి వెళ్తే.. జిమ్‌లో వర్కవుట్లు చేస్తూ ఎలాంటి సేఫ్టీ బెల్ట్ ధరించకుండానే 80 కిలోల బరువును ఎత్తింది రకుల్. దాంతో ఆమె వెన్నెముకకు గాయమైంది. ఈ గాయాన్ని లైట్ తీసుకోవడంతో అదికాస్తా తిరగబెట్టింది. దాంతో వైద్యుల సూచన మేరకు ఇప్పుడు మంచానికే పరిమితమైంది. తాజాగా.. తన ఆరోగ్యంతోపాటు మరి కొన్ని విషయాలను సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నది. 'వెన్నునొప్పిని పట్టించుకోకుండా వ్యాయామం కొనసాగించా! దాంతో గాయం తీవ్రమై.. ఆరు రోజులుగా బెడ్‌పైనే ఉన్నా. నా శరీరం కంటే.. నా మనసే ఎంతో బలమైందని నమ్ముతున్నా. నాకు ఇదొక పాఠం. మీరుకూడా మీ శరీరం ఇచ్చే సంకేతాలను పట్టించుకోండి' అంటూ చెప్పుకొచ్చింది రకుల్. ఇటీవలే 'భారతీయుడు 2'లో సందడి చేసిన ఈ సుందరి.. ప్రస్తుతం బాలీవుడ్ చిత్రం 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నది.

# లీడ్ రోల్.. నా డ్రీమ్!

**మలైకా అరోరా..** ఐదు పదుల వయసులోనూ పాతికేళ్ల పడుచులకు ఏమాత్రం తీసిపోని సౌందర్యరాశి. సినిమాలతో సంబంధం లేకుండా నిత్యం వార్తల్లో నిలిచే బాలీవుడ్ బ్యూటీ! ఆమె గురించిన ప్రతి వార్తా ఓ సెన్సేషనే! అది అర్బాజ్ ఖాన్‌తో విడాకులైనా.. అర్జున్ కపూర్‌తో డేటింగ్ ముచ్చటైనా.. సోషల్ మీడియాలో చర్చ సాగాల్సిందే! తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మలైకా అరోరా.. తన వ్యక్తిగత, వృత్తి జీవితం గురించి కొన్ని విషయాలు పంచుకున్నది. తాను ఇప్పుడు ఎలాంటి విచారం లేకుండా జీవిస్తున్నాననీ వెల్లడించింది. 'నాపై వచ్చే విమర్శలు నన్నెప్పుడూ బాధించలేదు. పైగా ఆ ప్రతికూలతల నుంచే ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నా! అంతేకాదు.. వ్యక్తిగతంగా, వృత్తిపరంగానూ నేనిప్పుడు మంచి పొజిషన్‌లోనే ఉన్నా. దానికి కారణం.. నేను తీసుకున్న నిర్ణయాలే!' అంటూ చెప్పుకొచ్చింది. ఇక కెరీర్ గురించి మాట్లాడుతూ.. 'చాలా సినిమాల్లో అతిథి పాత్రలు, ప్రత్యేక గీతాల్లోనే నటించా. నేనే ప్రధాన పాత్రలో ఓ సినిమా చేయాలని ఉన్నది!' అంటూ తన మనసులో మాట బయటపెట్టింది మలైకా. అర్బాజ్ ఖాన్‌తో విడాకుల తర్వాత.. తనకన్నా చిన్నవాడైన అర్జున్ కపూర్‌తో డేటింగ్ కొనసాగించింది మలైకా! తాజాగా, వీరిద్దరూ విడిపోయారనే వార్త.. బీటౌన్‌లో షికారు చేస్తున్నది. ఆ బ్రేకప్‌ను ఉద్దేశించే మలైకా ఇలా మాట్లాడిందంటూ నెట్టింట చర్చ నడుస్తున్నది.



# మూడుతోనే ముగిద్దామనుకున్నా

**కండ్లతోనే** కోటి భావాలను పలికించడం.. ఒక్క కాజోల్‌కే చెల్లింది! 90లనాటి కుర్రకారును తన మత్తు కండ్ల మాయలో పడేసి.. ఓలలాడించింది. 30 ఏండ్ల సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎన్నో మరుపురాని చిత్రాలను తన ఖాతాలో వేసుకున్నది. అయితే.. పరిశ్రమకు వచ్చిన తొలినాళ్లలోనే నటనను విడిచి పెట్టాలనుకున్నట్లు కాజోల్ చెప్పుకొచ్చింది. తన తాజా చిత్రం 'దో పట్టి' ప్రమోషన్‌లో భాగంగా.. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తి



కర విషయాలను పంచుకున్నది ఈ బాలీవుడ్ సీనియర్ హీరోయిన్. మూడో చిత్రంతోనే చిత్రసీమకు గుడ్‌బై చెప్పేద్దామని భావించానని వెల్లడించింది. ఇంకా ఏం చెప్పిందంటే.. 'నేను ఇండస్ట్రీలోకి వచ్చిన కొత్తలో 'ఉధార్ కీ జిందగీ' అనే సినిమా చేశా. అది నా మూడో చిత్రం. అప్పటికి నాకు 18 ఏండ్లు ఉంటాయేమో! అప్పుడు ఇండస్ట్రీ అంతా కొత్తగా అనిపించేది. మూడో సినిమాకే ఎంతో అలసిపోయినట్లు భావించాను. భారీస్థాయి సినిమాలు చేయలేనేమో అనుకునేదాన్ని. దాంతో నటనకు గుడ్‌బై చెప్పాలనుకున్నా! అదే సమయంలో షారూక్ ఖాన్‌తో 'బాజీగర్' చేస్తున్నా! అప్పుడే షారుక్ నాకు ఓ అద్భుతమైన సలహా ఇచ్చాడు. అది నాకింకా గుర్తుంది. 'మీకు నటన తెలుసు. మీరు అద్భుతంగా చేస్తున్నారు. కానీ, ఇంకా నేర్చుకోవాలి!' అంటూ ప్రోత్సహించాడు. షారుక్ మాటలను స్ఫూర్తిగా తీసుకొనే.. ఇండస్ట్రీలో కొనసాగా!' అంటూ నాటి విషయాలను గుర్తుచేసుకున్నది కాజోల్. 1992లో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన కాజోల్.. 90లలో టాప్ హీరోయిన్‌గా కొనసాగింది. తాజాగా 'దో పట్టి' చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. ఇందులో కాజోల్ తొలిసారిగా పోలీస్ అధికారి పాత్రలో కనిపిచడం విశేషం.

## యదార్థ వ్యథ..

ఓటీటీ హిట్

### వాళై



**డిస్నీ+ హాట్ స్టార్:** అక్టోబర్ 11
**తారాగణం:** నిఖిలా విమల్, పొన్వెల్ ఎం, కలైయరసన్, రఘుల్ తదితరులు
**దర్శకత్వం:** మారి సెల్వరాజ్

**చరిత్రను** ఒక్కసారి రివైండ్ చేస్తే.. విషాధ సంఘటనలెన్నో రీల్స్‌లా కండ్లముందు కదలాడుతాయి. భీతిగొలిపే యుద్ధాలు.. ప్రకృతి విపత్తులు.. ఘోర ప్రమాదాలు.. ఇలా యదార్థ గాథలెన్నో సినిమాలుగా తెరకెక్కాయి. ఆయా చిత్రాల్లోని బాధితుల వ్యథలు.. ప్రేక్షకుల గుండెలను తడుముతాయి. కళ్లను తడిచేస్తాయి. డిస్నీ+హాట్‌స్టార్‌లో రికార్డ్ స్ట్రీమింగ్ నమోదు చేస్తున్న 'వాళై' కూడా అలాంటి చిత్రమే! తమిళనాడులోని ఓ మారుమూల గ్రామంలో 12 ఏండ్ల శివనంద (పొన్వెల్ ఎం) చుట్టూ ఈ కథ తిరుగుతుంది. తల్లి, పెళ్లీడుకొచ్చిన అక్క.. ఇదే అతని కుటుంబం. అరటి తోటల్లో పనిచేయడమే ఆ నిరుపేద కుటుంబంతోపాటు ఊరి ప్రజల జీవనాధారం. ఉదయాన్నే లారీ రావడం, అందరూ సద్దులు కట్టేసుకుని అందులో వెళ్లడం.. అరటి గెలలు దించి లోడ్ ఎత్తడం.. ఆ లారీపైనే కూర్చుని రాత్రికి ఇంటికి చేరుకోవడం.. ఇదే వారి దైనందిన జీవితం. కాంట్రాక్టర్ దగ్గర తీసుకున్న అప్పు తీరాలంటే శివనంద కూడా పనిచేయాల్సిందే! తనకు ఇష్టం లేకున్నా.. అరటి గెలలు దింపాల్సిందే! శివకు మాత్రం స్కూల్‌కి వెళ్లడం, చదువుకోవడం ఇష్టం. క్లాస్‌లో ఎప్పుడూ ఫస్ట్ ఉండే శివ అంటే.. ఆ స్కూల్ టీచర్లలందరికీ ఎంతో మురిపెం. అతనికి మాత్రం పూన్‌గుడి టీచర్ (నిఖిలా విమల్) అంటే ఎంతో అభిమానం. పేదరికంలో మగ్గుతూ.. సెలవు రోజుల్లో పనికి వెళ్తూ, బాగా చదువుకుంటున్న శివ అంటే.. ఆ టీచర్‌కి కూడా ఎంతో మమకారం. ఒకరోజున శివ తల్లికి జబ్బు చేయడంతో.. ఆమెకు బదులుగా అరటి గెలలు దింపడానికి శివ వెళ్లాల్సి వస్తుంది. అదే రోజున స్కూల్‌లో తన డ్యాన్స్ ప్రోగ్రామ్ రిహార్సల్స్ ఉండటంతో.. శివ పని ఎగ్గొట్టి స్కూల్‌కి వెళ్తాడు. మధ్యాహ్నం భోజనం లేక ఆకలితో అలమటిస్తాడు. ఇంటికొచ్చి చాటుగా అన్నం తినబోతుంటే.. వాళ్ల అమ్మ చూసి, పని ఎగ్గొట్టాడని చితకబాదుతుంది. ఖాళీ కడుపుతోనే ఊరి బయటికి వెళ్లిపోయి.. వాగులో నీళ్లుతాగి.. అలసటతో అక్కడే నిద్రలోకి జారుకుంటాడు. తెల్లారి లేచి ఊళ్లోకి వచ్చేసరికి.. ఊరివాళ్లంతా ఏడుస్తుంటారు. ప్రతి ఇంటిముందూ ఓ శవం కనిపిస్తుంది. అసలు.. ఆ రాత్రి ఏం జరిగింది? ముందురోజు పనికి వెళ్లినవాళ్లంతా శవాలుగా ఎందుకు మారాల్సి వచ్చింది? అనేది తెలుసుకోవాలంటే.. సినిమా చూడాల్సిందే! 1990లలో తమిళనాడులో జరిగిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. రూపాయి కోసం గ్రామీణ కూలీలు పడే అవస్థలు.. అరటిపండ్ల వ్యాపారుల దోపిడీ.. పేదరికంతో చదువుకు దూరం అవుతున్న పిల్లలు.. ఈ అంశాలన్నిటినీ కండ్లకు కడుతుంది. గాఢమైన భావోద్వేగాలను పంచుతుంది.